క్లుప్తంగా

పరామర్శ



బత్తల వెంకటరమణను పరామర్శిస్తున్న కడపల మోహన్‌రెడ్డి

కదిరి అర్బన్‌: ఇటీవల మోకాలి ఆపరేషన్‌ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కుమ్మరవాండ్లపల్లి మాజీ సర్పంచ్‌ బత్తల వెంకటరమణను ఆయన నివాసంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ కడపల మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య వివరాలను బత్తల కుమారుడు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



ఇంటింటా అక్షింతలు పంచుతూ భజనలు చేస్తున్న రామసేవకులు

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రామసేవకులు ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభం తరువాత ప్రతి ఒక్కరూ పూజ గదిలో 5 దీపాలను వెలిగించి అక్షింతలను పూజించుకుని ఇంట్లో భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో..

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం అయోధ్య శ్రీరామ తీర్థక్షేత్రం ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఇంటింటికీ శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. గ్రామవీధుల్లో సీతారాముల చిత్రపటాన్ని ఊరేగిస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు. అక్షింతలతోపాటు సీతారాముల చిత్రపటాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మప్రచారకర్తలు గూడూరు రంగనాయకులు, గోవింద రాజులు, కుళ్లాయరెడ్డి, పార్థసారథి, బొగ్గు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరేగింపు



చిల్లవారిపల్లిలో శ్రీకాటికోటేశ్వర స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లిలో వెలసిన శ్రీకాటికోటేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామంలో ఏ పండుగ జరిగినా కాటికోటేశ్వర స్వామి విగ్రహాలను ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా గ్రామస్తులు ఉత్సవ విగ్రహాలను వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో డప్పులు వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా వీధివీధిలో స్వాములకు గ్రామస్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పిట్టు పెద్దశివారెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు గంగిరెడ్డిగారి నారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, నాగశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ వైఎస్సార్‌ క్రికెట్‌ టోర్నీ విజేత 'పెడబల్లి సీనియర్స్‌'



విజేతలకు నగదు, మెమెంటో అందజేస్తున్న నాయకులు

ఎన్పీకుంట: మండల పరిధిలోని పెడబల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 4 రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్‌ వైఎస్సార్‌ మెమోరియల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేతగా పెడబల్లి సీనియర్స్‌ జట్టు నిలిచింది. వైఎస్సార్‌ సీపీ నాయకులు, పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డిగారి హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో 14 జట్లు పాల్గొనగా మంగళవారం జరిగిన ఫైనల్‌ మ్యాచ్‌లో పెడబల్లి సీనియర్స్‌, ఎన్‌.పీ.కుంట లెవెన్‌లద్దూస్‌ జట్లు తలపడ్డాయి. పెడబల్లి సీనియర్స్‌ జట్టు విన్నర్‌గా నిలిచింది. వీరికి రూ.25,116, రన్నర్‌ జట్టుకు రూ.15,116 నగదుతో పాటు మెమెంటోను ఎంపీపీ ఈటెరాము అందజేశారు. హరీష్‌రెడ్డికి క్రీడాకారులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేశాయి భారతిరెడ్డి, వైస్‌ ఎంపీపీ కేశవరెడ్డి, వాటర్‌షెడ్‌ చైర్మన్‌ బయారెడ్డి, నాయకులు విశ్వనాథరెడ్డి, పుల్లారెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతోషంగా సంక్రాంతి సంబరాలు

● ఆలయాల్లో భక్తుల రద్దీ



ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనం అనంతరం ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పోట్లమర్రిలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి మూలవిరాట్‌



తాడిమర్రి: పూజలందుకున్న పెద్దమ్మ



ఎన్పీకుంట: ముగ్గులు వేస్తున్న మహిళలు

బత్తలపల్లి: ఏడాది పొడవునా ఎన్ని పండుగలు వచ్చినా తెలుగు వారికి సందడి తెచ్చేది సంక్రాంతే. సోమవారం బత్తలపల్లి మండలంలో పల్లెపండుగను ఆనందోత్సాహాల నడుమ గ్రామీణులు జరుపుకున్నారు. ప్రతి గ్రామంలో లోగిళ్లు కళకళలాడాయి. కళ్లాపు చల్లిన ముంగిళ్లలో రంగవల్లులపై గొబ్బెమ్మలు పెట్టి అందులో నవధాన్యాలు పోసి పూజలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు. మంగళవారం కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఇళ్లల్లోని గోవులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమ బొట్లతో కొమ్ములను అలంకరించారు. ఆడపడుచులు ఇంటి ముంగిట రంగవల్లులు వేసి రంగులను తీర్చిదిద్దారు. కొత్త బట్టలు ధరించి, పిండి వంటకాలతో రుచులు చూశారు.

దేవాలయాలు కిటకిట

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర క్షేత్రం, కాటకోటేశ్వర క్షేత్రంలతో పాటు పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, రామాపురం, మాల్యవంతంలోని వీరనారాయణ స్వామి, బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడు, లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయాలలో మహిళలు తరలివచ్చి పూజలు నిర్వహించారు. బత్తలపల్లిలో ఏపీ కురుబ కార్పొరేషన్‌ చైర్మన్‌ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, గుమ్మల్లకుంటలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్‌ బగ్గిరి బయపరెడ్డి, లింగారెడ్డిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే ఇంట..

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నివాసంలో సంక్రాంతి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలిరోజు ఆదివారం వేకువజామున ఇంటిముందు ఏర్పాటు చేసిన భోగి మంటలు కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సోమవారం మకర సంక్రాంతి రోజున నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద సంఖ్యలో నల్లసింగయ్యగారిపల్లికి తరలివచ్చి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుమారుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి, రాజేశ్వరమ్మ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో ప్రజలు సంతోషంగా సంక్రాంతి పండుగ సంబరాలు జరుపుకున్నారు. రైతులు పండించిన పంట ధాన్యాలతో పిండి వంటలు చేసుకొని ఆరగించారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. కనుమ పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో యువకులు, పిల్లలు గాలి పటాలు ఎగురవేయటం, ఆటల పాటలతో సంతోషంగా గడిపారు.

సందడిగా రంగవల్లుల పోటీలు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అంబేడ్కర్‌నగర్‌ యూత్‌ ఆధ్వర్యంలో సోమవారం రంగవల్లుల పోటీలు సందడిగా సాగాయి. గెలుపొందిన వారికి అంబేడ్కర్‌నగర్‌ యూత్‌ తరఫున బహుమతులు అందించారు.

గ్రామాల్లో కోలాహలం

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి కోలాహలం నెలకొంది. తాడిమర్రి, పెద్దకోట్ల, దాడితోట, పిన్నదరి, కునుకుంట్ల, నిడిగల్లు, ఎం.అగ్రహారం, ఆత్మకూరు, మద్దులచెర్వు తదితర గ్రామాల్లో ప్రజలు పండుగను ఘనంగా జరుపుకున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ధర్మవరం రూరల్‌: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన శ్రీపాద రెసిడెన్సీ అధినేత వంకదారి లక్ష్మీనారాయణశెట్టి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా పార్వేట

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ దేవరింటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్వేట ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామిఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు నిర్వహించిన ఏఎస్‌ఐ షెక్షావలితో పాటు సిబ్బందిని చైర్మన్‌ భాస్కర్‌రెడ్డి దుశ్శాలువలతో సన్మానించారు.

ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య మందిరం ముగ్గు

ధర్మవరం రూరల్‌: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన డిజైనర్‌ నాగరాజు, ఉషారాణి దంపతులు వేసిన అయోధ్య రామ మందిరం ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడున్నర గంటల పాటు శ్రమించి మూడు మీటర్ల పొడవున ముగ్గు వేశారు. చూడడానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హిందూ సాంప్రదాయాలను పట్టు చీరలపైనే కాకుండా ముగ్గుల రూపంలో చిత్రించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఆకట్టుకుంటున్న అయోధ్య రామమందిర నమూనా ముగ్గు

తిరుమలదేవుని ఆలయంలో..

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల పంచాయతీ బోయపల్లిలో వెలసిని తిరుమలదేవుని ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సోమవారం ముగిశాయి. భక్తులు తిరుమలదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా చెక్క భజన, కోలాటాలు చేపట్టారు. ఈ సందర్భంగా దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సంబరాలు అదరహో

పుట్టపర్తి రూరల్‌: పుట్టపర్తి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని ఉంటాయి. మంగళవారం రాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముగ్గులు పోటీలతో మొదలుకొని, సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, డీజే డాన్సుతో యువ కళాకారుల బృందం హోరెత్తించారు. జబర్దస్త్‌ సునామీ సుధాకర్‌ తన కామెడీతో కడుపుబ్బ నవ్వించాడు. మదనపల్లికి చెందిన కళాతరంగని గ్రూప్‌ కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముగ్గుల పోటీలో గెలుపొందిన భారతి, ప్రసన్న లక్ష్మి, లక్ష్మీలను బహుమతులతో అభినందించారు. మదర్‌ సాయి బిల్డర్స్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు, బీజేపీ కొండమ రాజు, సాయి టవర్స్‌ పద్మనాభం సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల వారిని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ తుంగ ఓబుళపతి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మూడో సారీ వైఎస్సార్‌ సీపీ జెండా ఎగరేద్దాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్‌ అహమ్మద్‌

● కదిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మక్బూల్‌ అహమ్మద్‌ పిలుపు

గాండ్లపెంట: కదిరి నియోజకవర్గంలో ముచ్చటగా మూడో సారి కూడా వైఎస్సార్‌ సీపీ జెండా ఎగురవేద్దామని పార్టీ సమన్వయకర్త బీఎస్‌.మక్బూల్‌ అహమ్మద్‌ పిలుపునిచ్చారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. కమతంపల్లి, కటారుపల్లి, గాండ్లపెంట, తూపల్లి, వంకపల్లి, వేపరాల గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. ఆయన గ్రామాల్లో ప్రజలను కలిసి ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సమష్టిగా సైనికుల్లా పనిచేసి కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ముచ్చటగా మూడో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం రెడ్డి, గంగోజమ్మ, రహంతుల్లా, ఉమాదేవి, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు ఫయాజ్‌అలీ, కన్వీనర్‌ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, ఎంపీటీసీ ఖమర్‌జహాన్‌, మాజీ సర్పంచ్‌ హుస్సేన్‌పీరా, బీసీ కన్వీనర్‌ నరసింహగౌడ్‌, క్రిష్టారెడ్డి, మాజీ కన్వీనర్‌ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, తాతం ధనుంజయ, రామాంజులరెడ్డి, పుల్లారెడ్డి, ఉపసర్పంచ్‌ ఫకృద్దీన్‌, ఇక్బాల్‌, సికిందర్‌, సిద్దారెడ్డి, అమానుల్లా, బహావుద్దీన్‌, సూర్యనారాయణరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.



వైఎస్సార్‌ సీపీలో చేరిన బాలేపల్లి తండా నాయకులు

'తామెప్పుడూ జగనన్న వెంటే..'

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల తమ కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, తామెప్పుడూ జగనన్న వెంటే ఉంటామని బాలేపల్లి తండాకు చెందిన యువకులు ఎం.బాలాజీ నాయక్‌,ఎం.నవీన్‌ నాయక్‌, మంజునాథ నాయక్‌, శశికుమార్‌ నాయక్‌ తెలిపారు. ఈ నెల 14న తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగరాజు తమను మభ్యపెట్టి కందికుంట వద్దకు తీసుకెళ్లి టీడీపీ కండువాలు వేశారని వాపోయారు. నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ సోనాలమ్మ ఆధ్వర్యంలో కదిరి సమన్వయకర్త బీఎస్‌ మక్బూల్‌ అహ్మద్‌ సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు.

అట్టహాసంగా ఉట్ల పరుష

నల్లమాడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని దొన్నికోట, ముసకవంకపల్లి గ్రామాల్లో ఉట్ల పరుష, పార్వేట ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఉట్లమాను ఎక్కేందుకు, పార్వేట ఉత్సవంలో కుందేలును పట్టుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. చిన్నారులు మొదలు వృద్ధుల వరకు జనం పెద్ద సంఖ్యలో వేడుకలను తిలకించారు. ముందుగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ స్వామి చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. దొన్నికోటలో కార్యక్రమానికి వైఎస్సార్‌ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బీఆర్‌ కేశప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి

ధర్మవరం అర్బన్‌: సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ మార్కెట్‌లోనున్న నాగుల కట్ట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజలు వేదమంత్రాల నడుమ చేపట్టారు. అనంతరం నూతనంగా తయారు చేయించిన రథంపై శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో అలంకరించి కొలువు దీర్చారు. దేవాలయ కమిటీ చైర్మన్‌ దాశెట్టి సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ సభ్యులు బండ్లపల్లి రంగనాథ్‌, నాగశేషు, విజయ్‌ తదితరులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. పొరాళ్ల పుల్లయ్య శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనలతో మారుమోగించారు. వన్‌టౌన్‌ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయించారు.

ప్రయాణికుల రక్షణే ధ్యేయం

ధర్మవరం అర్బన్‌: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల రక్షణస్త ఉద్యోగుల ధ్యేయమని ఆర్టీసీ డిపో మేనేజర్‌ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను డీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి డ్యూటీలకు రాకూడదన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు చేసి ప్రయాణికులను గమ్యానికి సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత ప్రతి ఆర్టీసీ డ్రైవర్‌పై ఉంటుందన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌, గ్యారేజ్‌ ఇన్‌చార్జ్‌లు వెంకటేషులు, సికిందర్‌, యూనియన్ల నాయకులు, డ్రైవర్లు, గ్యారేజ్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎం సత్యనారాయణ

ధర్మవరం నియోజకవర్గ ఓటర్లు @ 2,39,557 మంది



తహసీల్దార్‌ యుగేశ్వరిదేవి

ధర్మవరం: నియోజకవర్గంలోని ధర్మవరం టౌన్‌, రూరల్‌, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 2,39,557 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్‌ యుగేశ్వరిదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 1,19,086 మంది పురుషులు, 1,20,451 మంది మహిళలు, ఇతరులు 20 మంది కలిపి 2,39,557 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ధర్మవరం టౌన్‌లో 51,002 మంది పురుషులు, 52,212 మంది మహిళలు, ఇతరులు 15 మొత్తం 1,03,229 మంది ఉన్నారన్నారు. ధర్మవరం రూరల్‌లో 17,081 మంది పురుషులు, 17,034 మంది మహిళలు, 01 ఇతరులు కలిపి 34,116 మంది ఉన్నారని తెలిపారు. బత్తలపల్లి మండలంలో 16,059 మంది పురుషులు, 15,298 మంది మహిళలు, 04 ఇతరులు మొత్తం 32,361 మంది ఉన్నారు. తాడిమర్రి మండలంలో 12,051 మంది పురుషులు, 11,824 మంది మహిళలు మొత్తం 23,875 మంది ఉన్నారు. ముదిగుబ్బ మండలంలో 22,893 మంది పురుషులు, 23,083 మంది మహిళలు కలిపి 45976 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

వీధికుక్కల దాడిలో ఆవు దూడ మృతి

అమడగూరు: మండలంలోని నిలువురాతిపల్లిలో వీధి కుక్కల దాడిలో రెండేళ్ల ఆవుదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన కమ్మల ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ఆవుదూడ ఊరి చివర మేత మేస్తుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. శరీరమంతా గాయపర్చాయి. రక్తం చాలా పోవడంతో దూడ అక్కడిక్కడే మృతి చెందింది. సుమారు రూ. 40 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

ఆటోలను ఢీకొన్న కారు

ముదిగుబ్బ: ముదిగుబ్బలో మంగళవారం తెల్లవారు జామున రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ప్యాసింజర్‌ ఆటోలను వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రెండు ఆటోలు దెబ్బతిన్నాయి. కారు డ్రైవర్‌ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

బలిజ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

తలుపుల: మండల కేంద్రంలోని బలిజపేట రామాలయంలో మంగళవారం శ్రీకృష్ణ దేవరాయ బలిజ సేవా సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్లుగా కదిరి బలిజ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కార్యదర్శి పోగునూరు ఆది వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మేడా రామాంజులు, చెక్కా ప్రసాద్‌, అధ్యక్షులుగా ఎద్దులరాముడు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా కుళ్లాయప్ప, అన్నం జనార్ధన్‌, నారాయణ, ఎద్దుల గోపాల్‌, ఉత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌, కార్యదర్శులుగా రేవూరి సురేంద్ర, ఎద్దుల రమణ, లక్ష్మీనారాయణ,ఆంజినేయులు, శ్రీధర్‌, శ్రీనివాసులు, ట్రెజరర్‌గా వేణుగోపాల్‌, యువజన అధ్యక్షులుగా విష్ణువర్ధన్‌, ఉపాధ్యక్షులుగా జయవర్ధన్‌, కార్యదర్శిగా నరేష్‌ను ఎన్నుకున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

నల్లమాడ: అధైర్యపడొద్దు..అండగా ఉంటానంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధైర్యం చెప్పారు. మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే..అనారోగ్య పీడితులు, మృతుల కుటుంబాలను పరామర్శించారు. వంకరకుంటలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటివద్ద కోలుకొంటున్న కే.శివారెడ్డి, క్యాన్సర్‌ వ్యాధికి గురై చికిత్స పొందుతున్న బి. అరుణమ్మను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. బాసంవారిపల్లిలో పలు రకాల జబ్బులతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంటివద్ద కోలుకొంటున్న ఏ. చిన్న మాధవరెడ్డి, బాసం సుశీలమ్మ, కుంచెపు గంగులమ్మను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రెడ్డిపల్లిలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన చింతమాను నబీరసూల్‌, జీ. లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ కే. సూర్యనారాయణ, వంకరకుంట, రెడ్డిపల్లి గ్రామాల సర్పంచ్‌లు కుళ్లాయప్ప, ప్రసాద్‌, నాయకులు టీడీ విజయశేఖర్‌రెడ్డి, ఓబిరెడ్డి, చిన్నాగప్ప, కేశప్ప, షరీఫ్‌, యర్ర సూరి, బాబావలీ, హరినాథ్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, పెద్ద తిరుపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి తదితరులున్నారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్‌

అనంతపురం సెంట్రల్‌: రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉన్నప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చని జేఎన్‌టీయూ ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్‌ దుర్గాప్రసాద్‌ పేర్కొన్నారు. సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్‌ దుర్గాప్రసాద్‌ మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు.